ఈనాడు

**Date:5th Feb,2019 Page No:03**

# అంతరిక్షం.. ప్రపంచ ఉమ్మడి ఆస్తి

- **ఇన్‌కాయిస్ వ్యవస్థాపక దినోత్సవంలో ఇస్రో మాజీ ఛైర్మన్ రాధాకృష్ణన్**

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: అంతరిక్షం.. ప్రపంచ దేశాల ఉమ్మడి ఆస్తి అని, మానవ సంక్షేమం కోసం అన్ని దేశాలు కలిసికట్టుగా పనిచేయాలని ఇస్రో మాజీ ఛైర్మన్ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవాకేంద్రం (ఇన్‌కాయిస్) 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. "భారతదేశం అంతరిక్ష ప్రయోగాల్లో సాధించిన విజయాలతో ప్రపంచ దేశాల సరసన నిలిచింది. ప్రజాధనంతో నిర్మితమవుతున్న పరిశోధనా సంస్థలు ప్రజలకు, దేశానికి సేవలందించాలి. ఇలాంటి సేవల విషయంలో ఇన్‌కాయిస్ ముందు వరుసలో ఉంది. గగన్‌యాన్ ద్వారా ముగ్గురిని అంతరిక్షంలోకి పంపించి వారం రోజుల పాటు అక్కడే ఉంచి తిరిగి క్షేమంగా భూమిపైకి తీసుకురావడానికి ఇస్రో పరిశోధనలు చేస్తోంది. చంద్రయాన్-2లో రోవర్‌ను చంద్రుడిపై దింపనున్నాం. ప్రయోగానికి కొన్ని నిమిషాల ముందు కూడా వైఫల్యాలను గుర్తించే బలమైన వ్యవస్థ ఉండాలి. మార్స్‌పైకి మానవ సహిత అంతరిక్ష యాత్ర చేపట్టాలంటే వ్యోమగాములకు 1000 రోజులకు మించి అంతరిక్షంలో గడపగలిగే శక్తి ఉండాలి. కానీ, ఇప్పటి వరకు ఉన్న రికార్డుల ప్రకారం గరిష్ఠంగా 365 రోజులు మాత్రమే అంతరిక్షంలో గడిపారు. మార్స్‌పై మనుషులు ఉండాలంటే మాడ్యూల్, కంటైనర్లలో గడపాలి. వాటిని అక్కడికి ఎలా తరలించాలనేది సమస్య. ఇవన్నీ రానున్న రోజుల్లో సాధ్యం కావచ్చు. కలలు కనడంలో తప్పులేదుగా.." అని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సముద్ర అన్వేషణ' అనే అంశంపై 7, 8, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కాయిస్ డైరెక్టర్ సతీష్ షెనోయ్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.




ఇన్‌కాయిస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో బహుమతులు గెలుపొందిన విద్యార్థులతో ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్, ఇన్‌కాయిస్ డైరెక్టర్ సతీష్ సి.షెనాయ్